ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 4 జూన్ 2025



ఓమండూరార్ ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో కరుణ విగ్రహానికి పూలమాల వేసి, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్





మెరీనాబీచ్‌లో కరుణ సమాధివద్ద మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి నివాళులర్పిస్తున్న స్టాలిన్

సెమ్మొళి దినంగా కరుణ జయంతి

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 102వ జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు కరుణ జయంతిని 'సెమ్మొళిదినం'గా పాటించి, రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ప్రభుత్వం తరఫున, డీఎంకే తరఫున సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన నివాసంలో మంగళవారం ఉదయం కరుణానిధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి వెళ్ళి అక్కడి కరుణానిధి ఫోటో వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత మాతృమూర్తి దయాళు అమ్మాళ్ ఆశీస్సులందుకున్నారు. అక్కడి నుండి అన్నా అరివాలయంలో జరిగిన కరుణ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత కోడంబాక్కం వెళ్ళి అక్కడి మురసొలి పత్రిక కార్యాలయ ప్రాంగణం వద్దనున్న కరుణ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుండి నేరుగా మెరీనాబీచ్‌కు వెళ్ళి కరుణానిధి సమాధివద్ద నివాళులర్పించారు. అరంతకం అన్నాసాలైలోని ఓమండూరార్ ప్రభుత్వ ఆసుపత్రి భవనం ముందున్న కరుణ విగ్రహానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. స్టాలిన్‌తో పాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, పెరియకరుప్పన్ సామినాథన్, టీఆర్‌బీ రాజా, మాజీ మంత్రి పొన్ముడి, ఎంపీలు టీఆర్‌బాలు, ఎ.రాజా, దయానిధి మారన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, మైనారిటీల సంఘం మాజీ అధ్యక్షుడు పీటర్ ఆల్ఫోన్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో తమిళభాషకు ప్రాచీన హోదా కల్పించేందుకు తీవ్రంగా కృషి చేసిన కరుణానిధి సహా వివిధ తమిళ దిగ్గజాల చిత్రపటాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను స్టాలిన్ వీక్షించారు.




కరుణ జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న స్టాలిన్

కలైవానర్ అరంగంలో...

కరుణానిధి జయంతి సందర్భంగా చేపాక్ కలైవానర్ అరంగంలో ఏర్పాటు చేసిన సెమ్మొళి దినం వేడుకల్లోనూ స్టాలిన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీఎంకే మిత్రపక్షాల నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యదర్శి మురుగానందం స్వాగతం పలికారు. సభకు అధ్యక్షత వహించిన స్టాలిన్ సెమ్మొళిదినం సందర్భంగా తమిళభాషకు సేవలు చేసిన ఐదుగురు వృద్ధ తమిళ పండితులకు ఆర్థిక సహాయం అందించారు. నాలుగేళ్ల డీఎంకే పాలనపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తమిళ సంస్కృతి, తమిళ భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటేలా నిర్వహించిన నృత్య కార్యక్రమాలను తిలకించారు. ఈ వేడుకల్లో మంత్రులు సామినాథన్, ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు టీఆర్‌బాలు, దయానిధి మారన్, ఎండీఎంకే నేత వైగో, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, సీపీఐ నేత ముత్తరసన్, ముస్లిం నేత కేఎం ఖాదర్‌మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ముసాయిదా బిల్లులకు గవర్నర్ ఆమోదం



అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపించిన రెండు ముసాయిదా బిల్లులకు గవర్నర్ ఆర్ ఎన్ రవి మోక్షం కల్పించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, పంచాయతీ యూనియన్లు, పట్టణ పంచాయతీ, పురపాలక, కార్పొరేషన్లలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా సభ్యుల నియామకానికి సంబంధించిన బిల్లు ప్రభుత్వం రూపొందించి, దాని ఆమోదం కోసం గవర్నర్‌కు పంపించారు. ఈ బిల్లుల రూపకల్పన కోసం తమిళనాడు గ్రామ పంచాయతీల చట్టం 1994, తమిళనాడు మున్సిపాలిటీ చట్టం 1998 సవరణ చేశారు. ఈ రెండు బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపారు. వీటివల్ల 650 మంది బధిరులు గ్రామీణ ప్రాంతాల్లోనూ, 12,913 మంది ప్రతిభావంతులు గ్రామ పంచాయతీలు, పంచాయతీ యూనియన్‌లు, జిల్లా పంచాయతీల్లో 388 మంది, కార్పొరేషన్లలో 37 మంది దివ్యాంగులను ప్రత్యక్ష ఎన్నికల్లో ఎన్నుకునే అవకాశం ఉంది. అయితే విశ్వాస పరీక్ష నిమిత్తం జరిగే ఓటింగ్‌లో ఓటు వేసేందుకు అనర్హులని ఆ ముసాయిదా బిల్లుల్లో పేర్కొన్నారు.

ప్రియురాలిని హతమార్చి యువకుడి ఆత్మహత్య

- పెరంబూరులో దారుణం

చెన్నై, జూన్3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు రాజీవ్‌గాంధీ నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు దిగిన ప్రేమ జంట అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ప్రియుడే ఆ యువతిని హతమార్చి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి... విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరు ప్రాంతానికి చెందిన ఆకాష్ (19)బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే జిల్లాకు చెందిన అభినయ (19) ఆకాష్ చదువుతున్న కళాశాలలోనే చదువుతోంది. ఒకే కళాశాలలో చదువుతుండటంతో వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో పదిహేను రోజుల క్రితం వారిద్దరూ పెరంబూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వారం రోజులపాటు ఏ గొడవ లేకుండా సంతోషంగా గడిపిన వారి మధ్య ఉన్నట్టుండి మనస్పర్థలు ఏర్పడ్డాయి.తరచూ రాత్రిపూట గొడవపడుతుండేవారు. ఆ విధంగానే సోమవారం రాత్రి కూడా ఇద్దరూ గొడవపడ్డారు. కాసేపటికి శబ్దాలు ఆగిపోయాయి.చుట్టుపక్కల వారు అనుమానంతో కిటికీ నుండి లోపలికి చూడగా ఆకాష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి చూడగా, అభినయ శరీరంపై గాయాలతో రక్తపు మడుగులో పడి వుంది. ఆకాష్ ఉరేసుకుని మృతి చెందాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.. ఐసీఎఫ్ పోలీసుల ప్రాథమిక విచారణలో అభినయపై కత్తితో దాడి చేసిన అనంతరం ఆకాష్ ఉరేసుకున్నట్లు తేలింది.



ఆకాష్, అభినయ (ఫైల్‌ఫొటోలు)

కొవిడ్‌పై ముందస్తు చర్యలు

- పుదువై సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి పేర్కొన్నారు. తమినాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 102 జయంతిని పురస్కరించుకుని మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వం తరుపున వేడుకలు నిర్వహించారు. పుదుచ్చేరి బీచ్ రోడ్డులో వున్న మేరీహాలులో కరుణానిధి చిత్రపటానికి సీఎం రంగస్వామి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూడేళ్ళ క్రితం ప్రపంచ దేశాలను వణికించిన కరోనా మహమ్మారి ఈ రాష్ట్రంలో వ్యాపించకుండా రాష్ట్రప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు మాస్కు ధరించాల్సిన అవసరంలేదని, ఒకవేళ కరోనా బారినపడిన వారికి చికిత్స అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు సిద్ధం చేసినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వ సూచనలు పాటిస్తూ ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని పలు రాజకీయ పార్టీల నేతలు కోరుతున్నారని, దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సీఎంతో పాటు మంత్రులు లక్ష్మీనారాయణన్, సాయిశరవణకుమార్, ప్రతిపక్షనేత శివ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ఎమ్మెల్యేలు కెనడి, సంపత్, సెంథిల్‌కుమార్, కేఎస్‌పీ రమేష్, భాస్కర్ తదితరులు కూడా కరుణానిధి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు.



కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుదుచ్చేరి సీఎం రంగస్వామి

పూర్తిస్థాయిలో నిండిన వీరాణం చెరువు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని వీరాణం చెరువు పూర్తిస్థాయికి చేరటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు నుండి రాజధాని నగరానికి సెకనుకు 74 ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇదే విధంగా ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు రెండు వందల ఎకరాలకు పైగా సాగునీటిని విడుదల చేస్తారు. ఈ వీరాణం చెరువులో 47.50 అడుగుల మేరకు నీటిని నిల్వ చేసేందుకు వీలుంది. గత వారం రోజులుగా ఈ చెరువు చుట్టుపక్కల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులోకి నీరు చేరింది. దీంతో సోమవారం సాయంత్రం నీటిమట్టం 47.50 అడుగులకు చేరింది. పూర్తిస్థాయిలో నిండి సముద్రాన్ని తలపించేలా ఉన్న వీరాణం చెరువును చూసి రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. రెండు మూడు రోజుల్లోగా సాగునీరు విడుదల చేయడానికి ఇరిగేషన్ విభాగం అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు.



జలకళను సంతరించుకున్న వీరాణం చెరువు



ప్రముఖ రచయిత్రి తాయమ్మాళ్ అరవాననీకు 'కలైంజర్ కరుణానిధి సెమ్మొళి తమిళ అవార్డు' ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి

తాయమ్మాళ్ అరవానన్‌కు 'సెమ్మొళి తమిళ అవార్డు

- ప్రదానం చేసిన సీఎం స్టాలిన్

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో మంగళవారం నిర్వహించిన సెమ్మొళి దిన వేడుకల్లో భాగంగా ప్రముఖ తమిళ రచయిత్రి తాయమ్మాళ్ అరవానన్‌కు 2025 సంవత్సరానికి గాను 'కలైంజర్ కరుణానిధి సెమ్మొళి తమిళ అవార్డు'ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రదానం చేశారు. తాయమ్మాళ్ అరవానన్ మదర్ థెరిసా మహిళా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీవిరమణ చేశారు. మహిళాభ్యుదయాన్ని ఎలుగెత్తి చాటేలా ఆమె ఎన్నో రచనలు చేశారు. 'ఆదిమంది ముదల్ ఆండాళ్ వరై' ఆళ్వార్లలా దైవభక్తికే అంకితమైన మహిళా దిగ్గజాలపై పరిశోధనలు చేసిన 685 పేజీల గ్రంథాన్ని కూడా వెలువరించారు. తమిళ సాహిత్యాన్ని ఇంతటి విశిష్టసేవలందించినందుకు గాను ఆమెను ఈ అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డు కింద రూ.10లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని స్టాలిన్ అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సామినాథన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి వి. రాజారామన్, తమిళాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.అరుళ్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా మెట్రోరైల్ రెండోవిడత పనులు

- 33.33 మీటర్ల పొడవున 'యు' ఆకారంలో ట్రాక్

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ సంస్థ (సీఎంఆర్ఎల్) చేపట్టిన రెండో ప్రాజెక్టు అమలులో భాగంగా 33.33 మీటర్ల పొడవైన 'యూ' ఆకారపు గర్డర్ ట్రాక్ ఏర్పాటైంది. ఈ విధమైన ట్రాక్ ఏర్పాటు చేయడం భారతీయ మెట్రోరైలు చరిత్రలో ఇదే మొదటి సారని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. రాజధాని నగరంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు పరిచయం చేసిన మెట్రోరైలు పథకానికి నగరవాసుల నుంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో, భారతీయ మెట్రోరైలు నిర్మాణ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రామాపురంలో 33.33 మీటర్ల పొడవు కలిగిన 'యూ' ఆకారపు గర్డర్ ట్రాక్ ఏర్పాటైంది. భవన నిర్మాణం, ఇంజనీర్ రంగాల్లో ఇదొక మైలురాయని ఇందుకు కృషిచేసిన ఎల్ఎన్‌టీ ఇంజనీర్లు, కార్మికులను సీఎంఆర్ఎల్ అధికారులు అభినందించారు. మెట్రో రైలు పథకాలు పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్య ఉండదని, భవిష్యత్తు రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని రామాపురంలో పొడవైన స్టీల్ ఉపయోగించకుండా యూ ఆకారంతో గర్డర్ ట్రాక్ నిర్మించినట్లు అధికారులు వివరించారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన యూ గర్డర్ ట్రాక్‌ను తరలించేందుకు మల్టీయాక్సిల్ ట్రాలర్ వాహనాన్ని ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు.



స్థానిక రామాపురంలో 'యూ' ఆకారంలో నిర్మించిన ట్రాక్

అత్యాచారం కేసులో రహస్యాలివిగో

- ఆ సార్ ఎవరో సమాధానం చెప్పండి
- రెండు రోజుల్లో మరిన్ని ఆధారాలతో వస్తా
- బీజేపీ నేత అన్నామలై

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో జరిగిన అత్యాచారం కేసుతో కోట్టూరుపురం డీఎంకే స్థానిక నాయకుడు షణ్ముగంకు, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యంకు సంబంధాలున్నాయని బీజేపీ రాష్ట మాజీ అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ.. అత్యాచార కేసులో బాధితురాలికి సంపూర్ణంగా న్యాయం చేకూరలేదని, అందుకే తాను సేకరించిన ఆధారాలను వెల్లడిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 23 రాత్రి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు జ్ఞానశేఖరన్‌ను బంధించి స్టేషన్‌కు తీసుకెళ్ళిన కోట్టూరుపురం పోలీసులు స్టేషన్‌లో ఉంచకుండా విడిచిపెట్టారు. ఆ రోజు రాత్రే ఈ అత్యాచారం కేసుతో ఎవరెవరికి సంబంధాలున్నాయో ఆ ఆధారాలన్నీ నాశనం చేశారని ఆరోపించారు. 23 రాత్రి నిందితుడు జ్ఞానశేఖర్ మొబైల్ ఫ్లైట్‌మోడ్‌లో ఉన్న మాట వాస్తవమేనని, ఆ తర్వాతే అంటే రాత్రి 8.52 తర్వాత అతడు సీనియర్ పోలీసు అధికారికి ఫోన్ చేసిన మాట నిజమేనన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ హోదా కలిగిన ఆ పోలీసు అధికారి రాత్రి 9.01 గంటలకు జ్ఞానశేఖరన్‌కు ఎందుకు ఫోన్ చేశారో తెలియటం లేదన్నారు. ఇక ఈ కేసులో సీబీసీఐడీ నమోదు చేసిన రెండో ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) ఏ దశలో ఉందో వెల్లడించలేదన్నారు. డిసెంబర్ 24 ఉదయం నుండి సాయంత్రం దాకా జ్ఞానశేఖరన్ డీఎంకే స్థానిక నాయకుడు కోట్టూరు షణ్ముగం ఆరు సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారని, అదే రోజు రాత్రి కోట్టూరు షణ్ముగం, ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యంతో ఫోన్ మాట్లాడారన్నారు. ఈ అత్యాచారం కేసులో ఏ సార్‌ను కాపాడేందుకు డిసెంబర్ 24 రోజంతా ఈ తతంగం జరిగిందో, దాని వెనుక దాగిన మర్మమేమిటో త్వరలోనే తాను వెల్లడిస్తానని అన్నామలై చెప్పారు. ఇక అన్నావిశ్వవిద్యాలయం ఉద్యోగి నటరాజన్, డీఎంకే స్థానిక నాయకుడు షణ్ముగం 23 రాత్రి ఫోన్‌లో మాట్లాడుకున్నారని, ఆ తర్వాత వరుసగా మూడు రోజులు నటరాజన్, షణ్ముగం 13 సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నట్లు పేర్కొన్నారు.



అన్నామలై

బాధితురాలికి బెదిరింపు..

అత్యాచారానికి గురైన బాధితురాలి వద్దకు ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు వెళ్ళి జరిగిన సంఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా కేసు వాపసు చేసుకోవడం మంచిదని, లేకుంటే సమాజంలో అవమానాలను ఎదుర్కోవలసి ఉంటుందని బెదిరించారన్నారు. ఆ ఇద్దరు పోలీసు అధికారులు ఎవరో అన్ని వివరాలు తన దగ్గరున్నాయని, ప్రస్తుతం తాను చేస్తున్న ఆరోపణలపై సీఎం స్టాలిన్ బదులిస్తే వాస్తవాలను వెల్లడిస్తానన్నారు. తాను సేకరించిన ఆధారాలను పరిశీలించిన మీదట డిసెంబర్ 24వ తేదీ రాత్రి అత్యాచారం కేసుతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయో ఆ ఆధారాలన్నింటినీ నాశనం చేశారని అన్నామలై ఆరోపించారు. కోట్టూరు షణ్ముగం, ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యంను హైకోర్టు నియమించిన సిట్, ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. జ్ఞానశేఖరన్‌పై ఇంకో అత్యాచారం కేసు కూడా ఉందని చెబుతున్న పోలీసులు ఆ కేసు ప్రస్తుతం ఏ స్టేజ్‌లో ఉందో చెప్పగలరా అని ప్రశ్నించారు. తానడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి స్టాలిన్ బదులివ్వాలని, మరో రెండు రోజుల్లో మరిన్ని ఆధారాలతో ప్రజల ముందు వస్తానని అన్నామలై ప్రకటించారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్న ప్రాంతాల వివరాలిలా వున్నాయి...

చిట్లంబాక్కం: టీఎన్‌హెచ్‌బీ కాలనీ, మాంబాక్కం మెయిన్‌రోడ్, మహేశ్వరి నగర్, ప్రియదర్శిని నగర్, ఒట్టియంబాక్కం మెయిన్‌రోడ్, వల్లువర్ నగర్, జయ నగర్.

మాంబాక్కం: శాంతినికేతన్ కాలనీ, తంబయ్య రెడ్డి కాలనీ, పార్వతి నగర్ (ఉత్తరం) కామాక్షి నగర్, బాలాజీ నగర్, కర్పగం నగర్, ఏపీఎస్ నగర్, ఎంజీఆర్ నగర్, శారదా గార్డెన్.

8 వరకు అగ్రి వర్సిటీలో అడ్మిషన్లు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ విశ్వవిద్యాలయంలో ఉన్న 14 కోర్సులకు ప్రభుత్వ కళాశాలల్లో 2,516 సీట్లు, స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలల్లో 4,405 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అన్నామలై విశ్వవిద్యాలయ వ్యవసాయ విభాగంలో అందుబాటులోవున్న 340 సీట్లు భర్తీకి గత నెల 9వ తేదీ నుండి https://tnau.ucanapply. com/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులను విద్యార్థులు పూర్తిచేసి, ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించవచ్చు.

రాష్ట్రానికి వర్ష సూచన

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో పశ్చిమ దిశ గాలుల్లో వేగం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం వేడి వాతావరణం నెలకొన్న కారణంగా కనిష్ఠంగా 90 డిగ్రీల నుండి గరిష్ఠంగా 102 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠంగా వేలూరు, తూత్తుకుడి, తిరుచ్చి, మదురై, కరూర్ జిల్లాల్లో 102 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఆ జిల్లాల ప్రజలు ఉక్కపోతతో తల్లడిల్లిపోయారు. అదేవిధంగా చెన్నై, ఈరోడ్, పాళయంకోట్టై, తంజావూరులో 10 డిగ్రీలు, నాగపట్నం, తిరుపత్తూరు, తిరుత్తణిలో 90 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక వేలూరు, కరూర్, దిండుగల్, చెన్నై ప్రాంతాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదైనట్లు మంగళవారం వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో పశ్చిమ దిశగా వీస్తున్న గాలులు వేగం పుంజుకున్న కారణంగా బుధవారం నుండి వచ్చే ఆదివారం వరకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని ఆ శాఖ హెచ్చరించింది.

పాఠశాలల్లో 2.17 కోట్ల పుస్తకాల పంపిణీ

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు 2.17 కోట్ల పాఠ్యపుస్తకాలు, 35 లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం ఉచితంగా పంపిణీ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32వేల పాఠశాలల్లో సుమారు 40 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు తొలిరోజు పాఠశాలకు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే ముందు నీతికథలు, క్రమశిక్షణ, సమాజంలో గౌరవంగా పెరగడం తదితరాలను నేర్పాల్సిందిగా టీచర్లకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వారం రోజుల పాటు ఈ అంశాలపై తరగతులు నిర్వహిస్తారు.

మెట్రోలో 89 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో గత నెల 89.09 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... మెట్రోరైళ్లలో ప్రజలు సౌకర్యవంతంగా, భద్రతగా ప్రయాణించేలా పలు చర్యలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో మే నెలలో 89,09,7245 మంది మెట్రోరైళ్లలో ప్రయాణించారని, ఆ నెల 5వ తేది అధికంగా 3,23,899 మంది ప్రయాణించారని తెలిపింది. ప్రయాణ కార్డులు వినియోగించి 5,86,430 మంది, టోకెన్లు వినియోగించి 1,268, గ్రూప్ టిక్కెట్ల ద్వారా 169, క్యూ ఆర్ కోడ్ వినియోగించి 42,33,865, సింగార చెన్నై కార్డు వినియోగించి 40,87,992 మంది మెట్రోరైళ్లలో ప్రయాణం చేశారు. మెట్రోరైలు ప్రయాణికులు క్యూ ఆర్ కోడ్ టిక్కెట్లు, ప్రయాణ కార్డులు, వాట్సాప్ (91 8300086000), పేటీఎం, ఫోన్ పే, సింగార చెన్నై తదితర కార్డులతో ప్రయాణిస్తే 20 శాతం రాయితీ కల్పిస్తున్నారు కాగా, జనవరిలో 86,99,344 మంది, ఫిబ్రవరిలో 86,65,803, మార్చిలో 92,10,069, ఏప్రిల్‌లో 87,89,587 మంది మెట్రో రైళ్లలో ప్రయాణించినట్లు సీఎంఆర్‌ఎల్ తెలియజేసింది.

ఇంజనీరింగ్ కోర్సులకు 2.81 లక్షల మంది దరఖాస్తు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2.81 లక్షల మంది దరఖాస్తు చేసినట్లు ఉన్నత విద్యాశాఖమంత్రి కేవీ చెలియన్ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గత నెల 7వ తేదీ ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఇంజనీరింగ్ కోర్సులకు 2.81 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 1,20,807 మంది విద్యార్థులు 1,00579 మంది విద్యార్థినులు దరఖాస్తుతో పాటు ఫీజు కూడా చెల్లించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 11 ఇంజనీరింగ్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీకి తగ్గట్టుగా 12 పాఠ్యాంశాలను ఈ విద్యాసంవత్సరంలో పరిచయం చేయనున్నారు. అందువల్ల ప్రభుత్వ కళాశాల్లో అదనంగా 720 ఇంజనీరింగ్ సీట్లు పెంచామన్న మంత్రి, ఇందులో 7.5 శాతం అంతర్గత రిజర్వేషన్ కింద 54 సీట్లు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు 1800-425-0110 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని ఉన్నత విద్యాశాఖ తెలిపింది.

నెలాఖరులోగా రాయపురంలో తాత్కాలిక బస్టాండు


రాయపురం రైల్వేస్టేషన్ సమీపంలో రూ.7.50 కోట్లతో నిర్మిస్తున్న తాత్కాలిక బస్టాండు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బ్రాడ్వే బస్టాండును పునర్నిర్మించనుండటంతో ఈ నెలాఖరున రాయపురం రైల్వేస్టేషన్ సమీపంలో తాత్కాలిక బస్టాండు నిర్మాణం పూర్తవుతుందని జీసీసీ అధికారులు తెలిపారు. రాయపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఇబ్రహీమ్ రోడ్డులో మద్రాసు హార్బర్‌కు చెందిన 3.45 ఎకరాల్లో రూ.7.50 కోట్లతో ఈ తాత్కాలిక బస్టాండును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆ బస్టాండు నుండి ప్రతిరోజూ 130 సిటీ బస్సులను నడుపనున్నారు. బ్రాడ్వే సిటీ బస్టాండును ఈ నెలాఖరులోగా రాయపురం బస్టాండుకు మార్చనున్నారు. ప్రస్తుతం హైకోర్టుకు కూతవేటు దూరంలో ఉన్న బ్రాడ్వే బస్టాండును పూర్తిగా కూల్చివేసి, దాని పక్కనే ఉన్న కురళగం భవనాన్ని కూడా కూల్చి విశాలమైన బస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

10 అంతస్థులతో బ్రాడ్వే బస్‌స్టేషన్ : ప్రస్తుతం బ్రాడ్వే బస్టాండు ఉన్న ప్రాంతం, దాని పక్కనే ఉన్న కురళగం భవన ప్రాంతాన్ని కలుపుకుని విశాలమైన స్థలంలో పదంతస్థుల బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. వీటిలో 4 అంతస్థుల్లో బస్టాండు, బస్సులు నిలిచేందుకు ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తారు. తక్కిన 6 అంతస్థులలో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద ప్రకటించిన ఈ బ్రాడ్వే బస్‌స్టేషన్ నిర్మాణ బాధ్యతలను చెన్నై మెట్రోరైలు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

అన్నాకార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా



వేలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేలూరు రంగాపురం ప్రాంతంలో అన్నా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, కార్మికుల జీతాలు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

జిల్లాలో చెస్ శిక్షణా శిబిరం ముగింపు



వేలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా హేతువాది సంఘం ఆధ్వర్యంలో జరిగిన నెల రోజుల వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. పెరియార్ హాలులో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, ద్రావిడ కళగం నేతలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పెరియార్ పుస్తకాలను బహూకరించారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరం



వేలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగుల సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను పురమాయించారు. అదేవిధంగా వేలూరు సైదాపేటలో వున్న సుబ్రమణ్యస్వామి ఆలయ వీధిలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు కురవకముందే త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

బస్సు ఛార్జీలు పెంచం

● రవాణాశాఖ మంత్రి శివశంకర్

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బస్సు ఛార్జీలు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్ మరోమారు స్పష్టం చేశారు. గత రెండు,మూడు రోజులుగా సోషల్ మీడియాలో రాష్ట్రంలో బస్సు ఛార్జీలు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే కథనాలపై మంత్రి శివశంకర్ స్పందించారు. ఆయన అరియలూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, బస్సు ఛార్జీలు పెంచుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదన్నారు. ప్రైవేటు బస్సుల యజమానులు ఛార్జీలు పెంచాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారని, న్యాయస్థానం సూచన మేరకు ప్రైవేటు బస్సు ఛార్జీలు పెంచడంపై ప్రజాభిప్రాయం తెలుసుకుని నివేదిక అందజేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించిందని అయితే, కొన్ని మీడియా సంస్థలు బస్సు ఛార్జీలు పెంచుతున్నట్లు తప్పుడు కథనాలు ప్రసారం చేశాయని మంత్రి తెలిపారు. కేంద్రప్రభుత్వం డీజిల్ ధరను పలుసార్లు పెంచినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వ రవాణా సంస్థలు బస్సు ఛార్జీలు పెంచలేదన్నారు. పది రోజుల క్రితం రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపు ఉండదని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టంచేశారని, ఆ రీతిలోనే బస్సు ఛార్జీల పెంపు కూడా ఉండబోదని మంత్రి శివశంకర్ తెలిపారు.

లక్ష ఇళ్లకు 'స్మార్ట్ మీటర్లు'

● చెన్నై మెట్రోవాటర్ బోర్డు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో తొలి విడతగా లక్ష ఇళ్లలో స్మార్ట్ మీటర్లు పొందుపరచనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. నగరంలో కులాయిల ద్వారా 805.69 మిలియన్ లీటర్ల తాగునీటిని వినియోగిస్తున్నారు. అదేవిధంగా నగరంలో ఇటీవల విస్తరించిన ప్రాంతాల ప్రజలకు 206.62 మిలియన్ లీటర్ల తాగునీటిని వినియోగిస్తున్నారు. ఈ రకంగా రోజుకు సుమారు 1,100 మిలియన్ లీటర్ల తాగునీటిని క్రమబద్ధీకరించేందుకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు పలు చర్యలు చేపట్టింది. కాగా, తాగునీటి కనెక్షన్లు కలిగిన ప్రతీ ఇంటికి స్మార్ట్ మీటర్ పొందుపరచడం ద్వారా తాగునీటి వినియోగంలో అవకతవకలు తలెత్తేందుకు అవకాశం ఉండదని ఆ శాఖ అధికారులు తెలిపారు.

డీఎంకే కూటమిలోకి రండి

● డీఎండీకేకు కాంగ్రెస్ ఆహ్వానం

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో చేరాల్సిందిగా డీఎండీకేను తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆహ్వానించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, అన్నా డీఎంకే కూటమిలో కొనసాగుతున్న డీఎండీకేకు రాజ్యసభ సీటు కేటాయించని కారణంగా తమ కూటమిలో చేరాల్సిందిగా డీఎండీకేను కోరినట్లు ఆయన తెలిపారు. కూటమిలో చేరే వ్యవహారంపై డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

బన్నారిఅమ్మన్ ఆలయం వద్ద ఏనుగు సంచారం


సత్యమంగళం - మైసూరు రహదారిలో సంచరిస్తున్న ఏనుగు

చెన్నై, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం అటవీ ప్రాంతంలో ఉన్న బన్నారి అమ్మన్ ఆలయం వద్ద సోమవారం రాత్రి ఏనుగు సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఆలయానికి చేరువగానే సత్యమంగళం - మైసూరు జాతీయ రహదారి ఉంది. ఆ రహదారికి ఆనుకుని దట్టమైన అటవీ ప్రాంతం కూడా ఉంది. ఆ అటవీ ప్రాంతం నుండి తరచూ వన్యమృగాలు జనావాస ప్రాంతాల్లో సంచరించడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో బన్నారి అమ్మన్ ఆలయం వద్ద తరచూ ఏనుగులు సంచరిస్తున్నాయి. సోమవారం రాత్రి కూడా ఓ అడవి ఏనుగు సత్యమంగళం - మైసూరు జాతీయ రహదారిలో సంచరించింది. సుమారు మూడు గంటలపాటు ఆ ఏనుగు అటూ ఇటూ తిరిగింది. సోమవారం రాత్రి అటవీ ప్రాంతం నుండి బయటకు వచ్చిన ఆ ఏనుగు బన్నారి అమ్మవారి ఆలయం వద్దకు రావటంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాత్రంతా స్థానికులకు కంటిపై కునుకు పడకుండా చేసిన ఆ ఏనుగు తరిమికొట్టేందుకు ప్రయత్నించారు. ఆ లోగా సమాచారం అందుకుని అటవీ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఏనుగును తరిమే ఏర్పాట్లు చేపడుతున్నారు.

నీట్‌ను మళ్లీ జరపలేం

● హైకోర్టుకు తెలిపిన కేంద్రం

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యా అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో గత నెల 4వ తేదీ నిర్వహించిన నీట్ పరీక్షలను మళ్లీ జరపడం సాధ్యం కాదని కేంద్రప్రభుత్వం మద్రాస్ హైకోర్టులో ఆఫిడవిట్ దాఖలు చేసింది. ఆవడి కేంద్రంలో నీట్ రాసేందుకు 464 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన నేపథ్యంలో, భారీ వర్షాల కారణంగా మధ్యాహ్నం 3 నుండి 4.15 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ఆ కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అందువల్ల మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ఆవడి కేంద్రంలో పరీక్ష రాసిన 16 మంది విద్యార్థులు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడి చీకటి అలుముకోవడం వల్ల, పరీక్షా కేంద్రంలోకి వర్షపు నీరు ప్రవేశించడం వంటి కారణాల వల్ల సక్రమంగా పరీక్ష రాయలేకపోయామని పిటిషన్‌లో సూచించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు నీట్ ఫలితాలపై మధ్యంతర స్టే విధించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు మంగళవారం మళ్లీ మద్రాస్ హైకోర్టులో విచారణకు వచ్చింది. అప్పుడు కేంద్రప్రభుత్వం తరుపున హాజరైన న్యాయవాది వాదించారు. విద్యుత్ సరఫరాకు కలిగిన అంతరాయం వల్ల నీట్‌కు ఎలాంటి నష్టం ఏర్పడకుండా మళ్లీ పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. ఇరు తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం ఈ కేసు తీర్పు ఈ నెల 6వ తేదీ వెలువరించనున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

వేడుకగా రత్నగిరి ఆలయ ధ్వజారోహణం



వేలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని రత్నగిరి బాలమురుగన్ ఆలయంలో మంగళవారం వైకాశి బ్రహ్మోత్సవా ధ్వజారోహణం జరిగింది. ఆలయ ట్రస్టీ పూజలు నిర్వహించి ధ్వజ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, ఉత్సవమూర్తులు, వెండిమూషిక వాహనంలో ఊరేగారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ వరకు జరుగనున్నాయి. కొండదిగువనున్న బంగారు కవచం, శూలాలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. బాలమురుగన్ ఆడిమైస్వామి భక్తులను ఆశీర్వదించారు.

● బ్యానర్ తొలగింపు వ్యవహారం...

తిరుప్పూర్ కలెక్టరేట్ ముట్టడి


కలెక్టరేట్‌ను ముట్టడించిన బీజేపీ నేతలు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలతో ఏర్పాటు చేసిన బ్యానర్ తొలిగించడాన్ని తప్పుబడుతూ మంగళవారం తిరుప్పూర్ జిల్లా కలెక్టరేట్‌ను బీజేపీ నాయకులు ముట్టడించి ఆందోళన చేశారు. తిరుప్పూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గత నెల 30న రైతు విజ్ఞప్తుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతుల సంక్షేమార్థం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తొలగించిన వ్యవహారం వివాదాస్పదమైంది. దీనిపై వివరణ కోరుతూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసన్ నేతృత్వంలో వందమందికి పైగా బీజేపీ కార్యకర్తలు మంగళవారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారిని అక్కడినుండి వారిని వెల్లగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడాన్ని ఖండించిన బీజేపీ శ్రేణులు కార్యాలయ ప్రాంగణంలో బైఠాయించి నినాదాలు చేశారు. ఎలాంటి ప్రకటన లేకుండా బీజేపీ నిర్వాహకులు ధర్నాలో పాల్గొనడంతో ముందస్తు జాగ్రత్తగా ఆ ప్రాంతంలో పోలీసులు మోహరించారు.

మేకల చోరీ కోసం వచ్చారనుకునీ..!

అన్నదమ్ములపై దాడి ● పదిమంది అరెస్టు

అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మేకల దొంగతనం కోసం వచ్చారన్న అనుమానంతో అన్నదమ్ములపై గ్రామస్తులు తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అన్నదమ్ములు మృతి చెందారు. ఈ కేసులో పదిమంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శివగంగ జిల్లా అళగామ నగరి గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ... సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ గ్రామంలో కొందరు సంచరించడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వీరు మేకలు చోరీ చేసేందుకు వచ్చిన వారిగా భావించి, వారిపై దుడ్డుకర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అన్నదమ్ములు స్పృహ కోల్పోయారు. ఆ తర్వాత 108 అంబులెన్స్‌లో వారిద్దరినీ శివగంగ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ దాడిలో మృతి చెందిన వారిని ఇదే జిల్లాలోని కట్టానిపట్టి గ్రామానికి చెందిన మణికంఠన్ (30), ఆయన సోదరుడు విఘ్నేష్ (25)లుగా గుర్తించారు. మృతుల్లో మణికంఠన్ కోయంబత్తూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరూ మేకల్ని చోరీ చేసేందుకు వచ్చారన్న అనుమానంతో దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

● మాదకద్రవ్యాల తరలింపు...

నాలుగేళ్లలో 2,117 మంది అరెస్ట్

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నాలుగేళ్లలో మాదకద్రవ్యాలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 2,117 మందిపై గూండా చట్టం ప్రయోగించినట్లు తమిళనాడు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు, విక్రయాలను అడ్డుకునేందుకు ఎక్సైజ్ విభాగం నిఘా ముమ్మరం చేసింది. కల్తీసారా తయారీ, అక్రమ తరలింపు, విక్రయదారులను గుర్తించేందుకు ఆధునిక టెక్నాలజీని ఈ శాఖ ఉపయోగించుకుంటోంది. అక్రమాలకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలో దించింది. అంతేకాకుండా 105 అనే టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా మాదకద్రవ్యాల సమాచారాన్ని తెలియజేయవచ్చు. దీంతో పాటు 9498410581 అనే వాట్సాప్ నెంబరులో కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఆ విధంగా గత నాలుగేళ్ల లో మాదకద్రవ్యాల ఫిర్యాదులకు సంబంధించి గూండా చట్టం కింద 2,117 మంది అరెస్టు చేశారు. వీరిలో 107 మంది మహిళలు కాగా, 2,010 మంది పురుషులు కావడం గమనార్హం.

మదురై-తూత్తుకుడి రహదారిలో టోల్‌గేట్ వసూళ్లపై స్టే


ఎలియార్ బర్తీ, పుదూర్ పాండ్యపురంలోని టోల్‌గేట్

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిలోవున్న ఎలియార్ బర్తీ, పుదూర్ పాండ్యపురం టోల్‌గేట్‌లో రుసుము వసూలు చేయడానికి మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మంగళవారం స్టే విధించింది. ఎలియార్ బర్తీ, పుదూర్ పాండ్యపురంలో ఉన్న టోల్‌గేట్ 2011వ సంవత్సరం నుంచి జాతీయ రహదారిలో మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఆ మార్గం గుంతలమయంగా మారిందని, వాహనచోదకుల ఇబ్బందులను టోల్‌గేట్ నిర్వాహకులు పట్టించుకోనందు వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిలో మరమ్మతులు పూర్తి చేసే వరకు ఎలియార్ బర్తీ, పుదూర్ పాండ్యపురం టోల్‌గేట్ మీదుగా వెళ్ళే వాహనాల నుండి వసూలు చేస్తున్న పన్నులకు స్టే విధించాలని కోరుతూ మద్రాస్ మదురై బెంచ్‌లో ఓ ప్రజా వాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం సంబంధిత టోల్‌గేట్‌లో సుంకం పన్ను వసూలు చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది.

లైంగిక వేధింపుల కేసులో ముద్దాయికి మూడు జీవిత శిక్షలు

● చెంగల్పట్టు పోక్సో కోర్టు తీర్పు

అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తన పొరుగింటిలో నివసించే బాలుడు, బాలికను లైంగికంగా వేధించిన కేసులో ముద్దాయికి మూడు జీవిత కారాగార శిక్షలను విధిస్తూ చెంగల్పట్టు పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. సోమవారం వెలువడిన ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే, మహాబలిపురం ప్రాంతంలో తొమ్మిదేళ్ళ బాలుడు, ఏడేళ్ళ బాలికలు తమ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. వారింటి పక్కనే సత్య (30) అనే వ్యక్తి నివసించేవాడు. ఈ క్రమంలో 2016లో ఆ బాలుడు, బాలికను తన ఇంటికి తీసుకెళ్ళి వారిని బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. దానిని వీడియో తీసి చూపిస్తూ నాలుగేళ్ళపాటు లైంగికంగా వేధించాడు. ఈ క్రమంలో ఆ వీడియోను ఆ చిన్నారుల చిన్నాన్న స్నేహితులకు షేర్ చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న బాధిత చిన్నారుల తల్లిదండ్రులు చెంగల్పట్టు ఆల్ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో 2020 ఆగస్టు 20న ఫిర్యాదు చేశారు. దీంతో సత్యపై వివిధ సెక్షన్ల కేసు నమోదు చేసి అరెస్టు చేయగా, కేసు విచారణ చెంగల్పట్టు పోక్సో కోర్టులో సాగింది. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత న్యాయమూర్తి నసీమా బాను మంగళవారం తుది తీర్పు వెలువరించారు. ముద్దాయిగా తేలిన సత్యకు మూడు జీవిత కారాగారశిక్షలను విధిస్తూ తీర్పునిచ్చింది.

నేడు ఎమ్మెల్యేలతో ఈపీఎస్ సమావేశం

అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభకు వచ్చే యేడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి వరుసగా మంతనాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ సమవేశం జరుగుతుందని, ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గాల్లోని ప్రజా సమస్యలను ఎమ్మెల్యేలను అడిగి ఎడప్పాడి తెలుసుకోనున్నారు.

బక్రీద్ సందర్భంగా 50 వేల పొట్టేళ్ళ విక్రయం


అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ బక్రీద్ పండుగను పురస్కరించుకుని నగరంలో పొట్టేళ్లు, మేకపోతుల విక్రయం జోరుగా సాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మాంసం దుకాణా ద్వారా దాదాపు 50 వేల పొట్టేళ్ళ విక్రయాలు జరగవచ్చని తమిళనాడు మాంసం దుకాణం వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయపురం అలీ వెల్లడించారు. ఈ అంశంపై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, నగరంలో బక్రీద్ పండుగ కోసం 45 వేల నుంచి 50 వేల పొట్టేళ్ళు అమ్ముడయ్యే అవకాశం ఉందన్నారు. ఒక్కో పొట్టేలు బరువును బట్టి వీటి ధర ఉంటుందన్నారు. సాధారణ రోజుల్లో 10 కేజీల పొట్టేలు ధర రూ.10 వేలు పలుకుతుండగా, బక్రీద్ పండుగ కారణంగా 8 కేజీల పొట్టేలు ధర రూ.10 వేలు పలుకుతుందన్నారు. మేకపోతు బరువుకు తగిన విధంగా రూ.45 వేల వరకు ధర పలికిందన్నారు.

● వేదారణ్యంలో బస్‌స్టేషన్ వ్యవహారం ...

ఆ సంస్థకు నష్టపరిహారం చెల్లించండి : హైకోర్టు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా వేదారణ్యంలో కొత్తగా బస్‌స్టేషన్ నిర్మిస్తున్న స్థలం కస్తూర్బా గురుకుల ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు చెందినదని స్పష్టం చేసిన మద్రాస్ హైకోర్టు ఆ సంస్థకు నష్టపరిహారం చెల్లించాలని ఉత్తర్వులు జారీచేసింది. కొత్త బస్‌స్టేషన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కస్తూర్బా గాంధీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకుడు చొక్కలింగం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ చొక్కలింగం దాఖలు చేసిన అపీలు పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. హైకోర్టు న్యాయమూర్తులు అనితా సుమంత్, కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం సమక్షంలో ప్రభుత్వం, పిటిషనర్ల తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. ఈ వాదనల అనంతరం వేదారణ్యంలో ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన స్థలంలో బస్‌స్టేషన్ నిర్మిస్తున్నారని, అయితే సంబంధిత సంస్థకు 2013 స్థల సేకరణ చట్టం ప్రకారం మూడింతల నష్టపరిహారాన్ని చెల్లించిన తర్వాత నిర్మాణం ప్రారంభించాలని న్యాయమూర్తుల బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

కార్యకర్త ఇంటిలో భోజనం చేసిన తమిళి సై


అన్నదానం చేస్తున్న డాక్టర్ తమిళిసై సౌందరరాజన్

అడయార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తన పుట్టిన రోజును పురస్కరించుకుని తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ బీజేపీ కార్యకర్త ఇంటిలో భోజనం చేశారు. ఆమె తన పుట్టిన రోజు వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై, ఆ పార్టీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఆ పార్టీ సీనియర్ నేతలు తదితరులు ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత పట్టిణంపాక్కంలోని ఒక కార్యకర్త నివాసానికి వెళ్ళిన ఆమె... మధ్యాహ్న భోజనం చేశారు. అలాగే, ఆ కార్యకర్త ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

కమల్ మాటల్లో తప్పేముంది

● సీమాన్



తమిళ భాష నుంచి కన్నడం పుట్టిందంటూ అగ్ర నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ ప్రశ్నించారు. నగరంలో జరిగిన ఒక సినిమా ఆడియో రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'తమిళం నుంచి కన్నడం పుట్టిందని కమల్ హాసన్ అన్నారు. ఇది చరిత్ర. దీన్ని ఎవరూ చెరపలేరు. దాన్నే ఆయన వెల్లడించారు. అంగీకరిస్తారా? లేదా? అన్నది మీ ఇష్టం. 'కేజీఎఫ్' వంటి చిత్రాలను మీరు తమిళనాడులో స్వేచ్ఛగా విడుదల చేసుకునేందుకు అనుమతించాం. కానీ, ఇపుడు 'థగ్ లైఫ్'ను అడ్డుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. ఒకే.. మీరు ఇపుడు అడ్డుకుంటే రేపు మేము అడ్డుకోలేమా? అందువల్ల చరిత్రపుటల్లో ఉన్నదే కమల్ హాసన్ చెప్పారు. ఇందులో తప్పులేదు' అని ఆయన పేర్కొన్నారు.



కోలీవుడ్‌లోకి శ్రావణి శెట్టి ఎంట్రీ

గత యేడాది తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమైన ప్రముఖ మోడల్ బ్యూటీ శ్రావణి శెట్టి... ఇపుడు కోలీవుడ్ వెండితెరకు పరిచయమవుతున్నారు. జగన్నాథ పిక్చర్స్ పతాకంపై 'యమన్' పేరుతో నిర్మితమవుతున్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. ఇందులో జగదీష్ అమ్మాజీ హీరోగా నటించి, ఆయనే దర్శకత్వం వహిస్తున్నారు. 'ధర్మో రక్షితి రక్షితః' అనేది ఈ చిత్రం ట్యాగ్‌లైన్. పురాణ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నారు. ఒక పట్టణంలో యువతులు అదృశ్యం కావడం, ఈ చిత్రంలో యముడు పాత్రధారికి సంబంధం ఉందని ఊరువారంతా భావిస్తారు. ఈ పరిస్థితుల్లో ఆ యువతుల అదృశ్యం వెనుక ఎవరు ఉన్నారన్నది ఈ చిత్ర కథ. ఈ చిత్రాన్ని వైవిధ్యభరితంగా రూపొందిస్తున్నట్టు దర్శక హీరో జగదీష్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ చిత్రం తుది దశ నిర్మాణ పనులు జరుపుకుంటుంది. ఇది కమర్షియల్, లవ్, యాక్షన్ చిత్రాలకు భిన్నంగా ఒక కాన్సెప్ట్ కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. పురాణం, సస్పెన్స్, థ్రిల్లర్ వంటి అంశాలతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నాం' అని పేర్కొన్నారు.

హాస్య దిగ్గజం నగేష్ మనవడు హీరోగా 'వానరన్'

● ఆడియో రిలీజ్ చేసిన డాక్టర్ తమిళిసై

దివంగత హాస్య నటుడు నగేష్ మనవడు బిజేష్ నాగేష్ హీరోగా తెరకెక్కిన 'వానరన్' చిత్రం ఆడియో ట్రైలర్ రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. తెలంగాణ మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరై ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'ఒక సినిమా వేడుకకు తొలిసారి వచ్చాను. 'రామా'పురానికి చెందిన నిర్మాతలు హనుమంతుడుపై సినిమా తీశారు. మాజీ గవర్నర్, రాజకీయ నేతగా ఇక్కడకు రాలేదు. రాముడు, హనుమంతుడి భక్తురాలిగా మాత్రమే వచ్చాను. హనుమంతుడే నన్ను ఇక్కడకు ఆహ్వానించినట్టుగా భావిస్తున్నాను. ఈ చిత్రానికి హనుమంతుడే విజయాన్ని చేకూరుస్తాడు' అని పేర్కొన్నారు. ఈ వేడుకకు అతిథిగా వచ్చిన సినీ నటి కస్తూరి మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. ఇది జైశ్రీరామ్ అనే నినాదంతో ప్రారంభంకావడం మరింత ఆనందంగా ఉంది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సినిమాల్లో పెద్ద చిన్న బడ్జెట్ ముఖ్యంకాదు.. మంచి స్టోరీ. ఈ విషయాన్ని టూరిస్ట్ ఫ్యామిలీ మరోమారు నిరూపించింది. చిన్న బడ్జెట్ చిత్రాలకు వినోదపు పన్నును పూర్తిగా రద్దు చేయాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చిన్న చిత్రాలు సక్సెస్ సాధిస్తే చిత్రపరిశ్రమ బాగుంటుంది' అని పేర్కొన్నారు. కాగా, చిత్రంలో బిజేష్ నాగేష్, అక్షయ లొల్లుసభ జీవ, దీప శంకర్, ఆదేశ్ బాలా, నాంజిల్ విజయ్, బేబీ వర్ష్ తదితరులు నటించారు.



'వానరన్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

'మనుసి'కి సెన్సార్ సర్టిఫికెట్ నిరాకరణ

● కోర్టును ఆశ్రయించిన వెట్రిమారన్





గోపి నయినార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'మనుసి' చిత్రానికి సర్టిఫికెట్ ఇచ్చేందుకు సెన్సార్ సభ్యులు నిరాకరించారు. దీంతో ఆ చిత్ర నిర్మాత, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 'అరమ్' చిత్రం ద్వారా వెండితెరకు దర్శకుడిగా పరిచయమైన గోపి నాయర్.. తన తదుపరి ప్రాజెక్టుగా 'మనుసి' ప్రాజెక్టు తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆండ్రియా జెర్మయ్య ప్రధాన పాత్ర పోషించారు. ఇసైజ్ఞాని ఇళయరాజా సంగీతం సమకూర్చిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ఆవిష్కరించారు. తన మొదటి చిత్రం 'అరమ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా దర్శకుడు హీరోయిన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ రూపొందించారు. అయితే, ఈ మూవీని చూసిన సెన్సార్ బృందం సర్టిఫికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో చిత్ర నిర్మాత వెట్రిమారన్ కోర్టును ఆశ్రయించారు.




కోటలోని వెంకట రామస్వామి ఆలయం




కోట పైకి వెళ్లేందుకు మెట్లు




కోట ముఖ ద్వారం



రాజు సమావేశమయ్యే రచ్చబండ



8 అంతస్తుల గోపురం




సైనికుల గదులు

రాచరికపు ఆనవాళ్లు చరిత్రకు సాక్ష్యాలు

● గ్రేట్‌వాల్ ఆఫ్ సౌత్ ఇండియా
● జింజికోట రహస్యం

మహా సామ్రాజ్యాలు అవతరించి, అంతలోనే అంతమొందాయి. తాను అనుభూతి చెందిన రాచరికపు సొగసు, ఠీవిని భావి తరాలకు చూపించాలనే ఉబలాటం ఒకవైపు... మరోవైపు తనను సొంతం చేసుకునేందుకు జరుగుతున్న దండయాత్రలు, యుద్ధాలు, ఫిరంగి, తుపాకుల తూట్లు... అయినా నేలకొరగకుండా గంభీరంగా నిలబడి తన జ్ఞాపకాల దొంతరలను మనతో పంచుకుంటోంది జింజి కోట. విల్లుపురం జిల్లాలో వున్న దీనినే చెంజి, సెంజి అని కూడా పిలుస్తున్నారు. పేరేదైనా చరిత్ర మాత్రం ఒక్కటే - 'ద గ్రేట్‌వాల్ ఆఫ్ సౌత్ ఇండియా'. ప్రస్తుతం భారత పురావస్తు శాఖ పరిరక్షణలో ఉన్న ఈ జింజి కోట విశేషాలు తెలుసుకుందాం.

- వాషర్‌మెన్ పేట, ఆంధ్రజ్యోతి



జింజి కోట

కోట ఆవిర్భావం...

ఈ ప్రాంతాన్ని మొదట కోన్ వంశీయులు పరిపాలించారు. ఈ వంశానికి చెందిన అనంత కోన్‌కు ఈ ప్రాంతంలో గొప్ప నిధి లభ్యమైందని, దాంతో చిన్న సైన్యాన్ని, రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని వారి భద్రత కొరకు ఈ కోట నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇది కేవలం ఒకరి హయాంలోనే పూర్తి చేసుకోలేదు. కోన్ వంశస్తులు అంచలంచెలుగా పనులు చేయించగా, కోట్టి లింగ కురుంబర్ అనే రాజు హయాంలో కోట సంపూర్ణంగా రూపుదిదుకుఉందని శిలాశాసనాలు తెలుపుతున్నాయి.



ఏనుగులు స్నానమాచరించే కోనేరు

నిర్మాణం... : యుద్ధంలో శత్రువులను జయించడంకన్నా, శత్రువుల బారి నుండి తన ప్రజలను సంరక్షించగలిగిన వాడినే గొప్ప రాజుగా అప్పట్లో పరిగణించేవారు. అలాంటి ఆశయంతోనే కోన్ వంశస్తులు ఈ కోట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దట్టమైన అడవుల మధ్య సహజ సిద్ధంగా త్రికోణాకారంలో ఉన్న మూడు పెద్ద కొండలు, రెండు చిన్న తిప్పలను కలుపుతూ కోట నిర్మాణం ప్రారంభించారు. ఈ మూడు కొండల్లో రాజగిరి, కృష్ణగిరి ప్రధానమైనవి. అతిపెద్దదైన రాజగిరి కొండ మీద సుమారు 800 అడుగుల ఎత్తులో కోట నిర్మితమైంది. దీనిని చేరుకునేందుకు 1012 మెట్లు ఎక్కాలి. కోట చుట్టూ ఒక భారీ కొండ చిలువ ప్రాకుతున్నట్లు 12 కిలోమీటర్లు పొడవున ప్రహరీ గోడ నిర్మించారు. గోడ చుట్టూ రక్షణ కవచంగా 80 అడుగులలోతున కందకాన్ని ఏర్పాటు చేసి, శత్రువులు లోపలకు ప్రవేశించలేని విధంగా పగడ్బందీగా నిర్మించారు. కోటకు రెండు ముఖ ద్వారాలు న్నాయి. ఉత్తర ద్వారం వేలూరు, తూర్పు ముఖ ద్వారం పుదుచ్చేరికి చేరుకుంటుంది. రెండు ముఖ ద్వారాల వద్ద 24 అడుగుల వెడల్పు, 60 అడుగుల లోతుతో కూడిన కందకాలు, వాటిని దాటడానికి తాత్కాలిక లాగుడు వంతెనలు ఏర్పాటు చేశారు. శత్రువులు సమీపిస్తున్నట్లు తెలిస్తే, ఈ వంతెనలను తీసేసేవారు.

రెండవది కృష్ణగిరి. ఈ కొండ శిఖరంపై 300 మంది అతిథులతో ఒకేసారి రాజు సమావేశమయ్యేలా దర్బారు, అందులో రాజుకు ప్రత్యేక ఆసనం, అతిథులకు విడిగా ఆసనాలున్న ఆనవాళ్లు మనకు కనిపిస్తాయి. ఈ రక్షణ దుర్గాలను దాటుకుని లోనికి వెళ్తే, కల్యాణ మహల్ ఆహ్వానిస్తుంది. దాని పక్కన ఈత కొలను, మహారాణులకు వసతి గృహాలు కనిపిస్తాయి, ఇక్కడే ఎనిమిది అంతస్తుల మేడ ఉంది. ఇందులో పై అంతస్తు వరకు నీటి సరఫరా ఉంది. ఎలాంటి ఆధునిక పరిజ్ఞానం లేకుండా అంత ఎత్తు వరకు నీటిని ఎలా సరఫరా చేయగలిగారన్నది నేటి ఇంజినీర్లకు సైతం అంతు చిక్కడం లేదు. ఈ మహల్‌కు ఎదురుగా సైనికుల వ్యాయామ గదులు, విశ్రాంతి గదులు శిథిలావస్థలో కనిపిస్తాయి. అటుపక్కనే గుర్రపు చావళ్ల, ఏనుగుల మండపం, వాటి స్నానానికి కొలనులు కూడా కనిపిస్తాయి. కోట మరోవైపున ఖైదీలను బంధించేందుకు పాతాళ కారాగారం, దానికి కొద్ది దూరంలో అంతఃపురం, నాట్య మండపం కనిపిస్తాయి. ఇక్కడే రాజు-రాణి ఏకాంతంలో గడిపేవారని తెలుస్తోంది. పక్కనే పెద్ద రచ్చ బండ, దానిమీద రాజు ఆనుకుని కూర్చునేందుకు వీలుగా రాతి దిమ్మె ఉంది. ఇక్కడ రాజు సమావేశాలు నిర్వహించేవారని తెలుస్తోంది. ఇవి దక్షిణ భారత రాజుల నిర్మాణ నైపుణ్యంలో ప్రావీణ్యతకు ఉదాహరణ.

యునెస్కో బృందం పర్యటన

మరాఠా చక్రవర్తి వీర శివాజీ కైవసం చేసుకున్న 12 కోటలను ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించాలంటూ యునెస్కోకు కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది. దాంతో యునెస్కో బృందం గత ఏడాది సెప్టెంబరులో ఇండియా వచ్చారు. ఈ బృందంలో ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ సభ్యులు కూడా ఉన్నారు. వాస్తవానికి ఛత్రపతి శివాజీ కైవసం చేసుకున్న 12 కోటల్లో 11 కోటలు మహారాష్ట్రలో ఉండగా, జింజి కోట మాత్రమే తమిళనాడులో ఉంది. అయితే తాను కైవసం చేసుకున్న కోటల్లోకెల్లా జింజి అత్యంత ప్రత్యేకమైనదని, జింజి కోటంత సురక్షితమైన కోట భారత దేశంలో మరొక్కటి లేదని స్వయాన శివాజీయే ప్రశంసించడం గమనార్హం. 12 కోటలను సందర్శించిన యునెస్కో బృందం, దీనిపై నివేదిక సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా జింజి కోటకు ప్రపంచ వారసత్వ గుర్తింపు వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తమిళనాడును ఎంతోమంది రాజులు పరిపాలించి, తమ గుర్తుగా ఎన్నో నిర్మాణాలు చేశారు. వాటిలో దేవాలయాలు, కట్టడాలు కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. అయితే, కోట రూపంలో స్మృతులను మోసుకొస్తున్నది ఈ జింజి కోట మాత్రమే. 830 ఏళ్లపాటు ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ఇప్పటికీ కోట స్వరూపాన్ని కోల్పోకుండా తనకు వారసత్వ గుర్తింపు రాకుండా ఎక్కడకు పోతుంది అంటూ గంభీరంగా సమాధానమిస్తుందీ జింజి కోట.

తమిళులకు గుర్తుండిపోయిన దేశింగురాజ

సెంజి అనగానే తమిళులకు గుర్తొచ్చే పేరు దేశింగురాజ. ఆయన ఆ ప్రాంతాన్ని పాలించినది కేవలం పది రోజులు మాత్రమే. అయినా ఆయన సాహసం తమిళుల హృదయంలో చెరగని ముద్ర వేసింది. జింజి మొఘలు చక్రవర్తుల కైవసం అయిన తరువాత వారి సామంతు రాజుగా రాజా స్వరూప్ సింగ్ పాలన సాగించాడు. స్వరూప్ సింగ్ మరణానంతరం అతని కుమారుడు 22 ఏళ్ల రాజా తేజ్ సింగ్ చెంజికి తనే రాజని స్వయంగా ప్రకటించుకున్నాడు. ఇందుకు మొఘలు చక్రవర్తులు అంగీకరించలేదు. కానీ రాజా తేజ్ సింగ్ ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు, శాంతి చర్చలకూ వెళ్లలేదు. దాంతో మొఘలుల ఆదేశానుసారం ఆర్కాడు నవాబు 30 వేల మంది సైనికులతో తేజ్ సింగ్‌పై దండయాత్ర చేశాడు. అయితే అంత పెద్ద సైన్యాన్ని 850 మంది ఉన్న తన చిన్న సైన్యంతో తేజ్ సింగ్ ధీటుగా ఎదుర్కొన్నాడు. యుద్ధంలో వీర మరణం పొందినప్పటికీ అతని సాహస గుణాన్ని తమిళులు ఇప్పటికీ కీర్తిస్తుంటారు. రాజా తేజ్ సింగ్‌నే తమిళులు దేసింగురాజ అని ముద్దుగా పిలుస్తుంటారు.

జింజిని ఎవరెవరు పాలించారంటే...?



పాతాళ జైలు

తమిళనాట చోళ రాజుల పతనానంతరం ఇప్పటి పుదుచ్చేరి, తిరువణ్ణామలై నుండి ఆంధ్ర ప్రదేశ్‌లోని నెల్లూరు వరకు గల భూభాగాన్ని సింహపురి అని అప్పట్లో పిలిచేవారు. దానికి రాజధానిగా జింజి పట్టణం ఉండేదని చరిత్ర చెబుతోంది. విస్తారమైన ఈ భూభాగం సిరి సంపదలతో వరిల్లేదని శిలాఫలకాలు తెలియజేస్తున్నాయి. జింజి కోటపై కన్నేయని అప్పటి భరత ఖండపు అగ్ర రాజులు లేరనే చెప్పాలి. ఆనంద కోన్ వంశస్తులపై దండయాత్ర చేసిన విజయనగర నాయక్‌లు కోటను కైవసం చేసుకున్నారు. సుమారు 200 ఏళ్లపాటు విజయనగర నాయక్‌లు పరిపాలించగా, వీరి హయాంలోనే కోటలో పలు నిర్మాణాలు చేపట్టారు. ఆలయాలు, కల్యాణ మహల్, అంతఃపురం, సమావేశ వేదికలు, సైనికుల గదులు వీరు కట్టినవేనని అక్కడి శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. విజయనగర నాయక్‌ల అనంతరం ఇది బిజాపూర్ సుల్తానుల కైవసమైంది. ముట్టడి సమయంలో బిజాపూర్ సుల్తాన్ సైన్యం జింజి పట్టణాన్ని ధ్వంసం చేసింది. సుల్తానుల బారి నుండి జింజిని రక్షించిన ఛత్రపతి శివాజీ, ఈ కోటకన్నా సురక్షితమైనది మరొక్కటి లేదని కితాబిచ్చారు. అంతేగాక కోటను మరింత సురక్షితమైనదిగా తీర్చిదిద్దారు. శివాజీ మరణానంతరం అతని కుమారుడు రాజారామ్ శత్రువుల చేతిలో ఓడిపోయి, ఈ కోటలో తలదాచుకున్నట్లు చరిత్ర చెబుతోంది.



శిలాఫలకాలు

బ్రిటీష్-ఫ్రెంచ్ ఆధిపత్య పోరు...

1750వ సంవత్సరం బుస్సీ దొర నేతృత్వంలోని ఫ్రెంచి సైన్యం చెంజి కోటను దక్కించుకుంది. కేవలం 24 గంటల్లోనే కోటను చేజిక్కించుకోవడం చరిత్రాత్మక విజయంగా ఫ్రెంచ్‌వారు నేటికీ గొప్పగా చెప్పుకుంటుంటారు. కోటపై ఫిరంగులు ఏర్పాటు చేయడంతోపాటు, శత్రువులపై తుపాకులతో దాడి చేయడానికి వీలుగా ప్రత్యేక గూళ్లను నిర్మించి కోట భద్రతను రెట్టింపు చేశారు. అయితే భారీ బ్రిటీష్ సైన్యం ముందు ఫ్రెంచ్ సైన్యం తల వంచక తప్పలేదు. అయినా మరోమారు పటిష్ట సైన్యంతో వచ్చిన ఫ్రెంచ్ సేన ఆంగ్లేయులను ఓడించింది. ఇలా బ్రిటీష్-ఫ్రెంచ్ మధ్య జరిగిన ఆదిపత్య పోరులో చెంజి కోట తీవ్రంగా దెబ్బతింది. 1780లో ఈ కోటను హైదర్ అలీ కైవసం చేసుకున్నాడు. చివరగా 1799లో చెంజి కోట తిరిగి బ్రిటీషు వారి అదుపులోకి వచ్చింది.

150 ఏళ్ల పాటు సాగిన వరుస దండయాత్రలు, యుద్ధాలు జింజి కోటను గుక్క తిప్పుకోనీకుండా చేశాయి. ప్రజలు భీతావాహులై చెంజి పట్టణాన్ని విడిచి వెళ్లపోసాగారు. ఒకప్పుడు ధన, ధాన్యాలు, సిరి సంపదలతో తులతూగిన మహా పట్టణం, క్రమంగా కళావిహీనమై చిన్న పట్టణంగా కుంచించుకుపోయింది. కోట సమీపంలోని అడవి ప్రాంతం దోపిడిదారులు, దొంగల ముఠాలకు ఆవాస ప్రాంతమై, అసాంఘిక కార్యకలాపాలకు ఆలవాలంగా తయారయ్యింది. దాంతో జింజి కోట వలన శాంతి భద్రతలకు చేటు కలుగుతోందని, కోటను కూల్చి వేయాలన్న ప్రతిపాదన చేస్తూ, 1803వ సంవత్సరంలో అప్పటి ఆర్కాడు కలెక్టర్ కారో బ్రిటీషు ప్రభుత్వానికి లేఖ రాశాడు. అయితే అందుకు బ్రిటీషు ప్రభుత్వం ససేమిరా ఒప్పుకోలేదు. దాంతో పెద్ద గండం నుండి బయటపడిన జింజి కోట, అలనాటి సంఘటనలకు సజీవ సాక్ష్యంగా మనకు దర్శనమిస్తోంది.



ఆనాటి ఫిరంగి

ఏవీఆర్ అంబాసిడర్‌గా అరవింద స్వామి



బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏవీఆర్ స్వర్ణ మహల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు అరవింద స్వామి నియమితులయ్యారు. నగరంలో ఇటీవల ఏవీఆర్ స్వర్ణ మహల్ గ్రూప్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సరికొత్త ఆభరణాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏటీఎస్ సంజయ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సౌమ్య, డైరెక్టర్ ఏవీఆర్ సిద్ధాంత్, ఏవీఆర్ శ్రీస్మరణ్ కలిసి ప్రముఖ సినీ నటుడు అరవింద్‌స్వామిని తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా పరిచయం చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

● కళాకారులకు ఘన సత్కారం

ప్యారీస్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, ఒడిస్సీ, మోహినీయాట్టం నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్, గురువు రోజారాణి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ దుర్గా నటరాజ్ నేతృత్వంలో స్థానిక సాయిబాబా మందిరంలో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాయినాథుని కీర్తిస్తూ సాగిన ఈ నృత్య ప్రదర్శనలో కళాకారుల అభినయం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.. ప్రత్యేకించి రచయిత్రి జలంధర రచించిన 'ఓం సాయి ఆత్మాయం' కథ ఆధారంగా చంద్ర మోహన్ కుమార్తె, గురువు డాక్టర్ మాధవి మల్లంపల్లి నేతృత్వంలోని బృందం కూచిపూడి నృత్య నాటిక ప్రదర్శనతో వీక్షకులకు కనువిందు చేశారు. అదేవిధంగా ఒడిస్సీ, మోహినీయాట్టం నృత్యప్రదర్శనలు కూడా అలరించాయి. ఈ సందర్భంగా గురువు రోజారాణి మాట్లాడుతూ.. సంగీత, నృత్య కళలను పరిపోషించడమే లక్ష్యంగా భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ పనిచేస్తోందన్నారు. సాయిబాబా మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించడం తనకెంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. అనంతరం నృత్యప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించారు.



సత్కారం అందుకున్న కళాకారులతో గురు రోజారాణి

చిన్నశేషవాహనంపై గోవిందుడి చిద్విలాసం





తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఉదయం ఉత్సవర్లు చిన్నశేష, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతలు సమర్పించారు. వాహన సేవ ముందు కళాకారుల బృందాల కోలాటాలు, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, డిప్యూటీఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఏవీఎస్వో మోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' లో నటిస్తున్నా

● హీరో కార్తీక్ రాజు



'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే సినిమాలో నటిస్తున్నట్టు హీరో కార్తీక్ రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమా విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకున్న తనకు మళ్లీ ఇన్నాళ్లకు దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు ప్రాజెక్టులనూ తాను చేస్తున్నట్టు వెల్లడించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,418

తలనీలాలు సమర్పించినవారు: 34,900



● విస్తరిస్తున్న టాటా ట్రస్ట్ సేవలు
● స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ

తిరుపతిలో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం



శ్రీవారి పాదాల చెంత టాటా ట్రస్టు ఎంతో సమున్నత ఆశయంతో క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పింది. మూడేళ్లు పూర్తి చేసుకుంది. లాభాపేక్ష లేకుండా ఆస్పత్రి నడపాలన్నదే టాటా ట్రస్టు ఉద్దేశ్యం. ఆ దిశగా కృషి చేస్తున్నాం.





అలిపిరి నుంచి జూపార్క్‌కి వెళ్లే దారిలో పచ్చని వాతావరణంలో స్వీకార్ (శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్) ఉంది. టీటీడీ ఈ స్థలాన్ని టాటా సంస్థకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న రతన్ టాటాతో కలసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ సంస్థకు భూమిపూజ చేశారు. సుమారు రూ200 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో మూడేళ్లుగా క్యాన్సర్ ఆస్పత్రి నడుస్తోంది. ఈ ఆసుపత్రి అందిస్తున్న సేవల గురించి, ఇక్కడ ఉన్న ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల గురించీ స్వీకార్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలు ఇవి..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అత్యాధునిక పరికరంతో రేడియో థెరపీ

టాటా ట్రస్టుపై ఉన్న నమ్మకంతో రోగులు ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ ఆస్పత్రి కి వస్తున్నారు. ప్రారంభంలో రోజుకు 30 మంది వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 350కి చేరుకుంది. ఆసియాలోనే అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ టాటా ఆస్పత్రిలో ఉంది. ఏపీలో ఏ ఆస్పత్రిలో ఇటువంటిది లేదు. రూ. 20 కోట్లు విలువ చేసే ఈ పరికరం ద్వాఆరా రేడియో థెరపీ అందిస్తున్నారు. 2ఎంఎం ఉండే చిన్న చిన్న బ్రెయిన్ ట్యూమర్స్‌ను కూడా ఈ పరికరం ద్వారా కరిగించేవీలుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.



90 శాతం ఉచితమే : స్వీకార్‌లో 80 శాతం ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్‌ఎస్ రోగులే ఉంటారు. మరో 10 శాతం మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారానూ, దాతల సహకారంతోనూ చికిత్స అందిస్తున్నాం. అనంతపురం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక నుంచి కూడా పేషెంట్లు వస్తున్నారు. నెలకు 150 సర్జరీలు, 1200 కీమో థెరపీలు, 80 రేడియో థెరపీలు చేస్తున్నాం. మా సంస్థలో పెట్‌సిటీ సౌకర్యం ఉంది. నోటిద్వారా వచ్చే క్యాన్సర్లు, రొమ్ము, ఓవరీ, కడుపు, ఊపిరితిత్తులు క్యాన్సర్లతో ఇక్కడికి ఎక్కువమంది వస్తున్నారు. ప్రస్తుతం బ్రెయిన్ ట్యూమర్స్‌కు చికిత్స ట్రాన్స్‌ప్లాంటేషన్ స్వీకార్‌లో చేయడంలేదు. పిల్లలకు క్యాన్సర్ చికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. బ్లడ్ క్యాన్సర్ కేసులు కూడా ఇప్పుడు చూస్తున్నాం.

స్వీకార్ డైరెక్టర్ మన తిరుపతివాసి డాక్టర్ ప్రశాంత్

ప్రతిష్టాత్మకమైన స్వీకార్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌ది తిరుపతి. మూడో తరగతి వరకు తిరుపతిలో, ఆతర్వాత 10వరకు ఊటీ బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. నెల్లూరు నారాయణలో ఇంటర్ అయ్యాక మంగళూరులోని కస్తూర్బ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. వైజాగ్‌లోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంఎస్ పూర్తిచేశారు. ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో ఎంసీహెచ్ (సర్జికల్ అంకాలజీ) చేసిన డాక్టర్ ప్రశాంత్.. న్యూయార్క్‌లో రొబోటిక్ థొరాసిక్ సర్జరీపై శిక్షణ తీసుకున్నారు. పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో పదేళ్లపాటు సర్జికల్ ఆంకాలజిస్ట్‌గా పనిచేశారు. థొరాసిక్ సర్జరీ, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ, పెరిటోనియల్ సర్ఫేస్ మాలిగ్నన్సీల్లో ప్రత్యేక నిపుణుడుగా డాక్టర్ ప్రశాంత్‌కు పేరుంది. ఈయన తల్లి సులోచనమ్మ తిరుపతిలో వేలాది మందిని నర్సులుగా తయారు చేసిన విద్యావేత్త. సోదరుడు ప్రవీణ్ ఎడిఫై స్కూలు నడుపుతున్నారు. భార్య డాక్టర్ లక్ష్మీసంధ్య, స్వీకార్‌లోనే మెడికల్ ఆంకాలజీ విభాగంలో పనిచేస్తున్నారు.





అత్యాధునిక ఎమ్మారై పరికరం - మామోగ్రఫీ పరికరం

క్యాన్సర్ గుర్తించేందుకు క్యాంపులు

60 నుంచి 70 శాతం మంది కేన్సర్ 3 లేదా 4వ స్టేజ్‌లో వస్తున్నారు. ఇంకా ముందే గుర్తిస్తే చికిత్సకు వీలవుతుంది. అందుకే స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. రోగుల వద్దకే వెళ్లి పరీక్ష చేస్తున్నాం. లక్షణాలుంటే ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. ఇప్పటివరకు 805 క్యాంపులు నిర్వహించాం. వీటి ద్వారా 50వేల మంది రోగులను పరీక్షించగా 468మందిలో కేన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించాం. వారిలో 42 మందికి నిర్ధారించి, 40మందికి చికిత్స అందించాం.

లుకేమియాకీ చికిత్స

అధునాతన పద్ధతులతో కీహోల్ లంగ్ ఆపరేషన్లు, హైప్యాక్, బైప్యాక్ ప్రొసీజర్లు, ఐసీయూ, క్రిటికల్ కేర్, రీకన్స్ట్రక్టివ్ సర్జరీలు, కాలు నుంచి ఎముక తీసి ముఖానికి పెట్టడం వంటివి స్వీకార్‌లో చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి ఇమ్యునోథెరపీ కూడా ప్రారంభించాం. బ్రెయిన్‌లో ఎక్కడ క్యాన్సర్ గడ్డ ఉందో అక్కడే రేడియేషన్ (ఫోకస్డ్ రేడియేషన్)ఇచ్చే విధానం ఉంది. నాలుగు నెలలుగా లుకేమియాకు వైద్యం ప్రారంభించాం. అక్యూట్ క్యాన్సర్ వాళ్లకు అవసరమైన డయాలసిస్ యూనిట్‌ను కూడా ప్రారంభించాం. మరీ ముఖ్యంగా పాలేటివ్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. చివరి దశలో ఉన్న రోగులకు పాలేటివ్ కేర్‌లో అంకితభావంతో పనిచేసే సిబ్బంది మా సంస్థలో ఉన్నారు.



"వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స ఇచ్చేదానికన్నా ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడంతో చాలావరకు కేన్సర్‌ను నిరోధించవచ్చు. పింక్ బస్సు మెడికల్ మొబైల్ యూనిట్ ద్వారా ఆ పనిచేస్తున్నాం.ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఇందువల్ల మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తొలిదశలోనే చికిత్స అందించగలుగుతున్నాం."

రూ.4,500లుకే క్యాన్సర్ వ్యాక్సిన్

స్వీకార్‌లో సర్వైకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 9 నుంచి 14 ఏళ్ల వరకు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడానికి సరైన వయసు. మగవాళ్లు కూడా ఈవ్యాక్సిన్ వేసుకోవచ్చు. వారికి అనస్, నోటి క్యాన్సర్లు నిరోధించవచ్చు. పెళ్లికి ముందు 30 ఏళ్ల దాకా కూడా వేసుకోవచ్చు అమ్మాయిలు 3 డోసులు, అబ్బాయిలు 2 డోసులు వేసుకోవాల్సి ఉంటుంది. ఒక డోసు ఖరీదు రూ4.5వేలు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోకన్నా తక్కువ. ప్రజల్లో అవగాహన పెరగడం వలన సర్వైకల్ క్యాన్సర్ కేసులు గత పదేళ్లతో పోలిస్తే చాలా తగ్గుతున్నాయి.

చెరువులో దిగి గల్లంతైన పాడి రైతు



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు (55) పశువుల కోసం చెరువులో దిగి గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు భార్య మాధవితో కలసి పశువులను మేపేందుకు చెరువుకట్టపైకి వెళ్లారు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తుండగా ఆవుదూడ చెరువులోకి దిగింది. దూడను గట్టుమీదకు తీసుకొచ్చేందుకు శ్రీనివాసులు చెరువులోకి దిగాడు. ఆవుదూడ కాస్త లోతులోకి వెళ్లడంతో శ్రీనివాసులు ముందుకెళ్లి భార్య మాధవి కళ్లెదుటే నీటమునిగి గల్లంతయ్యాడు. చెరువు నీటిలో మునిగిపోయిన భర్త బయటకు రాకపోడంతో మాధవి కేకలు వేస్తూ గ్రామానికి చేరుకుని బంధువులకు తెలిపింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఎస్‌ఐ నాగరాజు, వీఆర్వో భూధనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరితో పాటు అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని శ్రీనివాసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం ఉదయం జరిగే యోగాంధ్రలో భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజాప్రతినిదులు, ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 2వేల మందికి పైగా పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు.

65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్

65 సంవత్సరాలు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వారు రేషన్ దుకాణానికి రావాల్సిన అవసరం లేదని డీలర్లే ఇంటి వద్దకు తెచ్చిస్తారన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు రీఓపెన్‌కు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మీ ఇళ్లను కూడా ఇలాగే ఉంచుకుంటారా...?

● ఆర్టీసీ పారిశుధ్య కార్మికులను మందలించిన జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది ప్రయాణీకులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్ ఇలానేనా ఉండాల్సింది... ఇక్కడ ఎటుచూసినా చెత్త కనిపిస్తుంది... ఇలా ఉంటే ప్రయాణీకులకు రోగాలు రావా... ఇక్కడ కార్మికులు ఎవరో పిలిపించండంటూ ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోట ఆర్టీసీ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన గంట పాటు తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోకి రాగానే ప్రాంగణం అంతా చెత్తాచెదారంతో నిండి ఉండటం, మరోపక్క నక్కలోళ్ల ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాకాడు ఆర్టీసీ డీఎం చిన్నపెంచలయ్యను పిలిపించి ఆర్టీసీ ప్రాంగణంలో నక్కలోళ్లను బయటకుపంపి శుభ్రం చేయించాలని కోరారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారికి ఫోన్‌చేసి నక్కలోళ్లను వెంటనే బయటకుపంపాలని కోరారు. మహిళల మరుగుదొడ్లకు గోడలపైన రేకులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి మీ ఇళ్లల్లో ఆడవాళ్లను ఇలాగే చూసుకుంటారా అని అక్కడ మరుగుదొడ్లను శుభ్రంచేసే కార్మికులను ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే కాంట్రాక్టర్ అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎలాంటి వ్యర్థాలు వేయకూడదని, ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ డిపోల్లో 3వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొత్తగా 950 బస్సులు కొనుగోలు చేసి, వాకాడు డిపోకు 14 బస్సులు ఇస్తామన్నారు. అన్ని డిపోలలో ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నట్లు సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, నాయకులు గిరిధర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, అంబరీషా, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.



కోట ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య కార్మికులను ప్రశ్నిస్తున్న జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

వెన్నుపోటు దినం ఎందుకు?

● వైసీపీ నేతలకు చంద్రగిరి ఎమ్మెల్యే సూటి ప్రశ్న ● సైకో పాలన విముక్తికి ఏడాది పూర్తయిందన్న నాని

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలకు జూన్ 4వ తేది పండుగ రోజు. కానీ వైసీపీ వారు మాత్రం వెన్నుపోటు దినమని చెబుతున్నారు. వెన్నుపోటు దినం ఎందుకు? ఐదేళ్ల వైసీపీ పాలనలో హౌసింగ్ పేరుతో తూతుమంత్రంగా స్థలాలు చూపి ఇల్లు కట్టనందుకా? ఒకేసారి పింఛను పెంచకుండా మోసం చేసినందుకా? ప్రజలకు మీరిచ్చిన హామీలను నెరవేర్చనందుకా? తల్లిని, చెల్లిని బయటకు పంపినందుకా? మద్యనిషేధం, మెగా డీఎస్సీ చేయకుండా చేసినందుకా? బీసీ,ఎస్సీ ఎస్టీ,మైనార్టీ నిధులు మళ్లించినందుకా? బాబాయిని గొడ్డలి వేటుతో నరికినందుకా? ఎందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నారు' అని వైసీపీని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి కబంధహస్తాల నుంచి.. సైకో పాలన నుంచి నేడు ప్రజలకు విముక్తి కలిగిన రోజు జూన్ నాలుగో తేది అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. దీనికి ఏడాది పూర్తయినట్లు తెలిపారు. ప్రజలు 11 సీట్లతో తీర్పు ఇచ్చినా వైసీపీనాయకుల్లో మార్పు రాలేదన్నారు. వెన్నుపోటు దినం పేరుతో ఘర్షణ వాతావరణం సృష్టించాలన్నదే వైసీపీ ప్లాన్ అన్నారు.సూపర్‌సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన దాడి, తుడాలో అవకతవకలపై మీడియా వారు ప్రశ్నించగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సమాధానం చెప్పారు. యోగాడేను బుధవారం ఉదయం చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికి.. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైన సందర్భంగా బుధవారం పండుగలా వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటలకు తిరుపతి నగరం ఎన్టీఆర్ నగర్‌లో ముగ్గులపోటీ, సాయంత్రం ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయం వద్ద దీపాలు వెలిగించడంతో పాటు టపాకాయలు కాల్చనున్నట్లు చెప్పారు.

'గొడ్డలి పోటు' దినం నిర్వహించండి

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ వెన్నుపోటు కాకుండా గొడ్డలిపోటు దినోత్సవంగా నిర్వహిస్తే బాగుండేదని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేసిన వైసీపీ ఎన్డీఏ కూటమి పాలనను విమర్శించే అర్హత లేదన్నారు.

వెన్నుపోట్లతా జగన్ కుంటుంబంలోనే..

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్ల చరిత్ర చూసుకుంటే జగన్ ఇంట్లోనే ఉన్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మంగళవారం అన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహారావు మీద చెప్పులు విసిరే దాక, ఆస్తుల కోసం చెల్లెలిని వదిలేసిన విధానం, వివేకానందరెడ్డి హత్య.. ఇలా వెన్నుపోట్లతోనే నిండి ఉందన్నారు.

పది మంది టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

తిరుపతి, జూన్3(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పది మంది టీడీపీ నేతలపై నమోదైన ఎన్నికల ఉల్లంఘన కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కొట్టివేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో ప్రచారానికి అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోలేదని తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, బి.జి. కృష్ణ యాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆశాలతపై కేసు నమోదైంది. సుదీర్ఘ విచారణ అనంతరం వీరిని నిర్దోషులుగా నిర్ధారించి కేసు కొట్టివేశారు. ఈ కేసును టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ దినకర్, సత్యశ్రీవాసన్ వాదించారు.

